క్లుప్తంగా

సూర్యఘర్ యోజన పథకంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

నెల్లిమర్ల: సూర్యఘర్ పథకంలో భాగంగా సోలార్ రూఫ్ టాప్ వినియోగించుకోవాలని ఏపీఈపీడీసీఎల్ ఆపరేషన్ టౌన్ డీఈ పి.త్రినాధరావు సూచించారు. జరజాపుపేటలో సూర్యఘర్ యోజన పథకంపై ఏపీఈపీడీసీఎల్ ఆధ్వర్యంలో విద్యుత్ సబ్‌స్టేషన్ అధికారులు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ సోలార్ సిస్టంతో విద్యుత్ పొదుపు చేయడానికి కేంద్ర ప్రభుత్వం సూర్యఘర్ యోజన పథకం ప్రవేశపెట్టిందన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామా రావు, కౌన్సిలర్లు అవనాపు సత్యనారాయణ, కె.కళావతి, ఏఈ పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

విజయనగరం టౌన్: స్థానిక మయూరీ జంక్షన్, నాగోజీపేటలో కొలువైన సంపత్ ఆంజనేయస్వామి ఆలయ 14వ వార్షికోత్సవం మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు వెలువలపల్లి కృష్ణ గాయత్రీశర్మ ఆధ్వర్యంలో వేకువజాము నుంచి స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం విఘ్నేశ్వర పూజ, సీతారామ విశిష్ట పూజలు, కలశాలతో పాలాభిషేకాలను విగ్రహ స్థాపకులు ఇసరపు శేఖర్ నిర్వహించారు. అనంతరం తమలపాకులు, అరటిపళ్లతో అర్చనలు, రుద్రాభిషేకాలు, సీతారామలక్ష్మణమూర్తుల పూజలు, సంపత్ ఆంజనేయస్వామి హోమం, తదితర కార్యక్రమాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నాగోజీపేట యువత సహకారంతో ఆలయ ఆవరణలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వేసవిలో అప్రమత్తంగా ఉండాలి

పూసపాటిరేగ: వేసవిలో అప్రమత్తతతోనే సురక్షితంగా వుండవచ్చునని గోవిందపురం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎవి.సుధారెడ్డి అన్నారు. మండలంలోని గోవిందపురం పీహెచ్‌సీలో మంగళవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవిలో సాధ్యమైనంత వరకు చల్లని ప్రదేశాల్లో వుండాలన్నారు. వదులైన పలుచని కాటన్ వస్త్రాలు ధరించాలి అని తెలిపారు. నీటిని ఎక్కువగా తీసుకోవడంతో పాటు మజ్జిగను తీసుకోవాలని సూచించారు. గది ఉష్ణోగ్రతలు తగ్గించుకోవడంతో పాటు చక్కటి వెంటిలేషన్, తలుపులు తెరిచేలా చూడాలని సూచించారు. ఎండ తీవ్రత నుంచి శరీరం డీహైడ్రేషన్‌కు గురికాకుండా చూసుకోవాలన్నారు. డీహైడ్రేషన్ రాకుండా మజ్జిగ, కొబ్బరి నీళ్లు, చల్లని పానీయాలు తీసుకోవాలని సూచించారు.

వ్యక్తిపై కేసు నమోదు

భోగాపురం: గుడిసెకు నిప్పు పెట్టిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సీఐ ఎన్వీ ప్రభాకర్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని దనాలపేట గ్రామానికి చెందిన దనాల నారాయణమ్మ పూరి గుడిసెకు అదే గ్రామానికి చెందిన దనాల శ్రీను సోమవారం నిప్పు పెట్టాడు. ఇది చూసిన మనువరాలు విషయం నారాయణమ్మకు చెప్పింది. ఈ ప్రమాదంలో పూరి గుడిసెతో పాటు తులం బంగారం, రూ.50 వేలు కాలి బూడిదయ్యాయి. నారాయణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

ఉద్యోగోన్నతి

బాడంగి: మండలంలో గ్రేడ్-4, 5 పంచాయతీ కార్యదర్శులుగా పనిచేస్తున్న ఇద్దరికి గ్రేడ్-3, 4 కార్యదర్శులుగా ఉద్యోగోన్నతి లభించిందని ఎంపీడీవో ఎస్.రామకృష్ణ మంగళవారం తెలిపారు. బొత్సవానివలస పంచాయతీలో గ్రేడ్-4 కార్యదర్శిగా పనిచేస్తున్న పి.మహేశ్వర రావుకు వాడాడ పంచాయతీ గ్రేడ్-3 కార్యదర్శిగాను, పూడివలస పంచాయతీ గ్రేడ్-5 కార్యదర్శిగా పనిచేస్తున్న బి.అప్పలనాయుడుకు దత్తిరాజేరు మండలం, రాజులరామచంద్రాపురం గ్రేడ్-4 కార్యదర్శిగా ఉద్యోగోన్నతి లభించినట్లు పేర్కొన్నారు. వారిద్దరికీ లిఖిత పూర్వక రిలీవింగ్ ఆదేశాలిచ్చామన్నారు.

వైభవంగా మారు జాతర



ఆలయం బయట పూజలు చేస్తున్న భక్తులు

రాజాం: స్థానిక పట్టణంలోని బొబ్బిలి రోడ్డులో కొలువైన పోలిపల్లి పైడితల్లి అమ్మవారి మారు జాతర మంగళవారం వైభవంగా జరిగింది. ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు ఆలయ 99వ జాతర మహోత్సవాలు నిర్వహించగా, ఎప్పటిలాగే ఇప్పుడు మారు జాతర జాతర చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

తెర్లాం: మండల కేంద్రంలో గ్రామదేవత హేమాలమ్మ(చిన్నమ్మ) వారాల పండగ మంగళవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమలు సమర్పించి, విశేష పూజలు చేశారు.

బొబ్బిలి: పట్టణంలోని బైపాస్ రోడ్డులో కొలువైన దాడితల్లి అమ్మవారికి మంగళవారం సుప్రభాతార్చన, ప్రత్యేక పూజలు చేశారు.

వైద్యులు లేని ఆస్పత్రి

- సేవలు అందేది ఎలా?
- సిబ్బందితో నడుస్తున్న జరజాపుపేట అర్బన్ పీహెచ్‌సీ
- ఇబ్బందులు పడుతున్న రోగులు
- పట్టించుకోని ఉన్నతాధికారులు



జరజాపుపేటలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

నెల్లిమర్ల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధి జరజాపుపేటలో అర్బన్ పీహెచ్‌సీ భవన నిర్మాణానికి సంబంధించి రూ.కోటి 11 లక్షల 70వేలు నిధులు మంజూరు చేసింది. దీంతో అర్బన్ పీహెచ్‌సీ నిర్మాణం పూర్తయి అప్పట్లోనే ప్రారంభించారు. దీంతో తమ చిరకాల కోరిక తీరిందని నగర పంచాయతీ ప్రజలు సంబరపడ్డారు. ఎన్నో ఏళ్ల కల నెరవేరిందని ఆనందపడ్డారు. అప్పటి నుంచి అక్కడి రోగులకు సేవలు అందుతున్నాయి. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఆస్పత్రి నిర్వహణపై నిర్లక్ష్యం వహించింది. ఫలితంగా రోగులకు అనుకున్నంత సేవలు అందక అవస్థలు పడుతున్నారు. వాస్తవానికి ఈ పీహెచ్‌సీలో అన్ని రకాల వ్యాధులకు సంబంధించి స్పెషలిస్టులు ఉండాలి. అలాగే ఇద్దరు వైద్యులు అందుబాటులో ఉండాలి. రోజుకో స్పెషలిస్ట్ డాక్టర్ సేవలు అందించాలి. కానీ ఇక్కడ మాత్రం అందుకు భిన్నంగా జరుగుతోంది. ఒక వైద్యుడు ద్రక్షయ రామునాయుడుతో ఇప్పటి వరకు సేవలు అందేవి. ఇప్పుడు ఆ వైద్యుడు కూడా ఉన్నత చదువుల నిమిత్తం ఇక్కడ నుంచి వెళ్లిపోయారు. దీంతో ఉన్న ఒక్క డాక్టర్ లేకపోవడంతో రోగులకు వైద్యం అందే పరిస్థితి లేకుండా పోయింది. నెల రోజులుగా వైద్యుడు లేకపోవడంతో ఆస్పత్రిలో అవసరమైన కనీస సేవలు కూడా అందడం లేదని రోగులు వాపోతున్నారు. చిన్నపాటి సేవల నిమిత్తం వచ్చే రోగులకు ఆస్పత్రి సిబ్బంది తమకు వచ్చిన వైద్యం అందించి మందులిచ్చి పంపిస్తున్నారు. ముఖ్యంగా ఇక్కడకు నగర పంచాయతీ ప్రజలతో పాటు మొయిద, విజయరాంపురం, పూడికపేట, కొండగుంపాం, గరికపేట, పారసాం, చంద్రంపేట, టెక్కలి, చినబూరాడపేట, పెదబూరడపేట తదితర గ్రామాల రోగులు వచ్చేవారు. ఇప్పుడు వైద్యులు లేకపోవడంతో వారు వేరే ప్రాంతానికి వైద్య సేవల నిమిత్తం పరుగులు పెడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అవసరమైన వైద్యులను నియమించి రోగులకు సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

దుకాణాలపై అధికారుల దాడులు



సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విక్రయాలు చేస్తున్న దుకాణంలో తనిఖీలు చేపడుతున్న సిబ్బంది

విజయనగరం: నగరంలో వివిధ ప్రాంతాలలో ప్లాస్టిక్ దుకాణాలపై ఆకస్మిక దాడులు చేసిన ప్రజారోగ్య అధికారులు, సిబ్బంది భారీ ఎత్తున సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకోవడంతో పాటు అధిక మొత్తంలో జరిమానాలను కూడా విధించారు. విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాలతో ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, పారిశుధ్య పర్యవేక్షకులు, సిబ్బంది సంయుక్తంగా 5వ సర్కిల్ పరిధిలోని బొడ్డు కళావతి జంక్షన్, కొత్త అగ్రహారం, గాజులరేగ, పిడబ్ల్యూ మార్కెట్ తదితర ప్రాంతాలలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విక్రయిస్తున్న దుకాణాలపై మంగళవారం దాడులు నిర్వహించారు. దాడుల్లో 490 కేజీల ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకుని, జిందాల్ వేస్ట్ ఎనర్జీ ప్లాంట్‌కు తరలించారు. అపరాధ రుసుము కింద 49 వేల రూపాయలు మొత్తాన్ని విధించారు. ఈ సందర్భంగా ప్రజారోగ్యాధికారి సాంబమూర్తి మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం పర్యావరణానికి, మానవాళి మనుగడకు ఎంతో ప్రమాదకరమని ఎన్నోసార్లు చైతన్యం కలిగిస్తున్నప్పటికీ వ్యాపారుల తీరులో మార్పు రావడం లేదన్నారు. ఇక నుంచి మరింత కఠినంగా వ్యవహరిస్తూ తరచూ విక్రయిస్తున్న ప్లాస్టిక్ వ్యాపారులపై కేసులు నమోదు చేయడంతో పాటు దుకాణాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ప్రధాన నినాదమైన సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధించడం తప్పనిసరి అని అన్నారు. ప్రజలు కూడా మరింత చైతన్యవంతులై సింగిల్ యూజ్ ప్లాస్టిక్ విధానానికి స్వస్తి పలకాలని హితవు పలికారు. దాడులలో పర్యావరణ కార్యదర్శులు, మేస్త్రీలు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపుపై నిరసన



విద్యుత్ బిల్లులను తగులబెడుతున్న సీపీఎం నేతలు

పూసపాటిరేగ: కూటమి సర్కారు విద్యుత్ బిల్లులు అమాంతంగా పెంచి సామాన్య, మధ్య తరగతి కుటుంబాలపై భారం మోపిందని సీఐటీయూ నాయకుడు బి.సూర్యనారాయణ అన్నారు. సీపీఎం జిల్లా వ్యాప్తంగా చేపట్టిన విద్యుత్ బిల్లుల పెంపుపై నిరసన కార్యక్రమంలో వీటిని తగులబెట్టారు. స్థానిక రాజావీధిలో పెంచిన విద్యుత్ బిల్లులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణమే తగ్గించాలన్నారు. కొవ్వాడ గ్రామంలో నిరుపేదలైన దళితులు గృహాలకు అధికంగా విద్యుత్ బిల్లులు వచ్చాయని, వాటిని చెల్లించలేక నానా అవస్థలు పడుతున్నారని తెలిపారు. పెంచిన విద్యుత్ బిల్లులు రద్దు చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ టొంపల సీతారాం, మండపాటి వాసురాజు తదితరులు పాల్గొన్నారు.

‘ఉపాధి’ కల్పనలో వివక్ష తగదు

- ఎంపీడీవోకు ఫిర్యాదు చేసిన బూరాడపేట గ్రామస్తులు



ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆందోళన వ్యక్తం చేస్తున్న వేతనదారులు

రాజాం సిటీ: ఉపాధి హామీ పథకం పనులు కల్పించడంలో వివక్ష చూపుతున్నారని మండలంలోని బొమ్మినాయుడువలస పంచాయతీ, బూరాడపేట వేతనదారులు వాపోతున్నారు. ఇదే విషయమై వారంతా స్థానిక ఎంపీడీవో కార్యాలయానికి మంగళవారం వెళ్లి, ఆందోళన వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులమని పనులు కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత నెలలుగా పనులు కల్పించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. పనులు కల్పించాలని ప్రాధేయపడితే వారం రోజుల క్రితం పనులు కల్పించి, రెండు రోజులకే పరిమితం చేశారన్నారు. ఎందుకిలా చేస్తున్నావని ఫీల్డ్ అసిస్టెంట్‌ను నిలదీస్తే గ్రామంలో పనులు లేవు.. మీ దిక్కున్న చోట చెప్పుకోండి అని అంటున్నాడని అన్నారు. వాస్తవానికి మేట్‌ల నియామకానికి ఎన్నిక జరగాల్సి ఉండగా, అలా చేయకుండా తన చేతివాటంతో నిబంధనలకు విరుద్ధంగా మేట్‌ను కూడా ఫీల్డ్ అసిస్టెంట్ మోహనరావు మార్చాడని ఆరోపించారు. గ్రామంలోని 50 మందికి పనులు కల్పించడం లేదన్నారు. ఇంతటి వివక్ష చూపడం సరికాదని, తక్షణమే పనులు కల్పించి తమను ఆదుకోవాలని వారంతా కోరారు. అంతకుముందు ఎంపీడీవో వి.శ్రీనివాసరావు, ఏపీవో కె.సాయిరాం వద్ద తమ గోడును వెల్లబుచ్చుకున్నారు. పనులు కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్ మోహనరావును వారు ఆదేశించారు. పనులు కల్పించకపోతే ఫిర్యాదు చేయవచ్చన్నారు.

పీఎంఏవై గృహ నిర్మాణదారులకు ఆర్థికసాయం



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఏఈ వేణుగోపాలనాయుడు

తెర్లాం: పీఎంఏవై(ప్రధానమంత్రి ఆవాస్ యోజన) పథకం కింద ఇళ్లు నిర్మించి, అసంపూర్తిగా ఉన్న ఇళ్లను పూర్తి చేసేందుకు ప్రభుత్వం అదనంగా చెల్లించనున్న సాయాన్ని లబ్ధిదారులంతా వినియోగించుకోవాలని మండల గృహ నిర్మాణ శాఖ ఏఈ రెడ్డి వేణుగోపాలనాయుడు కోరారు. స్థానిక జగనన్న కాలనీలో అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలను ఆయన మంగళవారం పరిశీలించారు. నిధులు చాలకపోవడంతో నిర్మాణాలు మధ్యలోనే ఉండిపోవడం చూసి రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికసాయానికి ముందుకు వచ్చిందన్నారు. బీసీ, ఎస్సీల ఇళ్లకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు చొప్పున అందిస్తుందన్నారు. ఆయన వెంట తెర్లాం ఎంపీటీసీ జి.ఆనందరావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు సత్యనారాయణ, శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

సారా నియంత్రణకు సహకరించండి

వంగర: సారా రహిత గ్రామాలే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని రాజాం ఎక్సైజ్ సీఐ ఆర్.జైభీమ్ అన్నారు. నవోదయం 2.0 పేరిట మండలంలోని కోదులగుమ్మడ గ్రామంలో సారా నిర్మూలనపై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. సారాను నిర్మూలిద్దాం.. గ్రామాన్ని ప్రగతిబాట పట్టిద్దామని ఆయన పిలుపునిచ్చారు. సారా తయారీ, రవాణా నేరమని, ఎక్కడైనా సారా విక్రయాలు జరిగితే సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. సమాజంలో సారా అనే పెనుభూతం లేకుండా చేసేందుకు గ్రామస్తులంతా సహకరించాలని కోరారు.

రిటైర్డ్ జ్యూట్ కార్మికులకు పింఛన్ అమలు చేయాలి

నెల్లిమర్ల: రిటైర్డ్ జ్యూట్ కార్మికులకు ఈపీఎఫ్ పింఛన్ వెంటనే అమలు చేయాలని పింఛన్‌దార్ల సంఘం జిల్లా నాయకులు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన స్థానిక సంఘం కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. గత రెండు సంవత్సరాల నుంచి రిటైర్డ్ జ్యూట్ కార్మికులకు ఈపీఎఫ్ పింఛన్ అమలు కాలేదని తెలిపారు. ముఖ్యంగా జ్యూట్ యాజమాన్యం పీఎఫ్ కార్మికుల నుంచి వేతనంలో కట్ చేసిన బకాయి గత రెండు సంవత్సరాలుగా ప్రభుత్వానికి చెల్లించకుండా నిర్లక్ష్యం చేయడంతో రిటైర్డ్ కార్మికులకు పింఛన్ అమలు జరగలేదన్నారు. దీనివల్ల రిటైర్డ్ కార్మికులు పింఛన్ అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా రిటైర్డ్ జ్యూట్ కార్మికులు గ్రాట్యూటీ బకాయిలు అందక, ఇటు పింఛన్ అమలు జరగకపోవడంతో పడరాని పాట్లు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈపీఎఫ్ అధికారులు రిటైర్డ్ జ్యూట్ కార్మికుల వివరాలను ఆన్‌లైన్ చేసి ఈపీఎఫ్ పింఛన్ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత రెండు సంవత్సరాలుగా పీఎఫ్ బకాయి ప్రభుత్వానికి చెల్లించకుండా నిర్లక్ష్యం చేసిన జ్యూట్ యాజమాన్యంపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

చిన్నారుల ఆరోగ్యంపై దృష్టి సారించాలి

రేగిడి: చిన్నారుల ఆరోగ్యంపై దృష్టిసారించాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సుజాత సూచించారు. మండలంలోని వండానపేట, కేఎంవలస, ఉంగరాడమెట్ట గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాలను ఆమె మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు చూసి, బరువు తక్కువగా ఉన్న చిన్నారుల ఆరోగ్యం మెరుగు పరచాలని, ఆ దిశగా తల్లిదండ్రులకు సూచనలు చేయాలన్నారు.

సర్వేల్లో బాడంగి ప్రథమ స్థానం

బాడంగి: ప్రభుత్వం చేయిస్తున్న సర్వేల్లో బాడంగి మండలం ప్రథమ స్థానంలో నిలిచిందని ఎంపీడీవో ఎస్.రామకృష్ణ తెలిపారు. ఇదే విషయమై ఆయన మండల కేంద్రంలోని తన కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. పీ4, వర్క్ ఫ్రమ్ హోమ్ సర్వేల్లో జిల్లాలోనే మండలం ప్రథమ స్థానం సంపాదించిందన్నారు. పీ4 సర్వే 99.2 శాతం మేర జరిగిందన్నారు. సర్వేకు సహకరించిన ప్రజలు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

స్వచ్ఛమైన తాగునీరు అందించాలి

తెర్లాం: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని ఎంఈవో జె.త్రినాధరావు సూచించారు. మండలంలోని నందబలగ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఆయన మంగళవారం తనిఖీ చేశారు. ప్లాంట్ సక్రమంగా పనిచేస్తుందా, లేదా అని హెచ్ఎం ఈశ్వరరావును అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాల రికార్డులు, విద్యార్థుల హోమ్ వర్కు పుస్తకాలు, మధ్యాహ్న భోజన పథకం, మరుగుదొడ్ల నిర్వహణను పరిశీలించారు. ఆ తర్వాత వివిధ ప్రశ్నలడిగి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు అంచనా వేశారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే సురక్షిత ప్రసవాలు



ఆరికతోట పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో జీవనరాణి

రామభద్రపురం: ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే సురక్షితమైన సాధారణ ప్రసవాలు జరుగుతాయని డీఎంహెచ్‌వో జీవనరాణి తెలిపారు. మండలంలోని ఆరికతోట, రామభద్రపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆమె మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రుల నిర్వహణకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. అలాగే ఓపీ వివరాలు, ప్రసవాలు ఎలా జరుగుతున్నాయి, సీజనల్ వ్యాధుల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై వైద్యాధికారులు దిలీప్‌కుమార్, అపర్ణలను రాతీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వైద్య సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని సూచించారు. ఆస్పత్రిలో సుఖ ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో రాజు, ఈవో మల్లిక్ తదితరులు పాల్గొన్నారు.

రూ.లక్ష వితరణ

పూసపాటిరేగ మండలంలోని కొవ్వాడఅగ్రహారంలో నూతన శివాలయం నిర్మాణానికి కొవ్వాడ అగ్రహారం సర్పంచ్ కోట్ల రఘు రూ.లక్ష వితరణగా మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దైవ కార్యక్రమానికి అందరు సహకరించాలని, శివుడి కరుణకటాక్షాలు గ్రామస్తులపై వుండాలని ఆకాంక్షించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు చందక సత్యం, గ్రామస్తులు కోట్ల సత్యం, లెంక రామకృష్ణ, లెంక సురేష్ తదితరులు పాల్గొన్నారు. – పూసపాటిరేగ



బీపీఎస్ దరఖాస్తులు పరిష్కరించండి

2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ప్రకటన పన్నులు, ఆక్రమణ పన్నులు శతశాతం వసూలు చేయాలని, అలాగే బీపీఎస్, ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి ఈ నెల 31వ తేదీ వరకు మాత్రమే గడువు ఉన్నందున తక్షణం వాటిని క్లియర్ చేయాలని ప్లానింగ్ కార్యదర్శులకు విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. తన కార్యాలయంలో సంబంధిత కార్యదర్శులతో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటివరకు సచివాలయాల వారీగా వసూలు చేసిన మొత్తాలను అడిగి తెలుసుకున్నారు. మార్చి 31వ తేదీ ఆర్థిక సంవత్సరం ముగింపులోగా అన్ని పన్నులను వసూలు చేసి లక్ష్యాలను అధిగమించాలని సూచించారు. సమావేశంలో ఏసీపీలు హరిబాబు, రమణమూర్తి, టీపీఎస్ అనిత తదితరులు పాల్గొన్నారు. – విజయనగరం



చెట్లను నరికేసి రోడ్డు పక్కన వదిలేశారు...!

- సొంతానికి వాడుకునేందుకు యత్నాలు
- అడ్డంకులు సృష్టిస్తున్న టీడీపీ నేతలు
- చెట్లు నరకడంతో ప్రశ్నించిన ఎమ్మెల్యే మాధవి
- భద్రపరిచేందుకు ముందుకు రాని అధికారులు



దన్నానపేట రహదారిలో రోడ్డు పక్కనే ఉన్న నరికేసిన చెట్లు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని దన్నానపేట గ్రామానికి వెళ్లే రహదారిలో కొన్నేళ్ల క్రితం అధికారులు సుమారు రెండు కిలోమీటర్ల మేర రోడ్డుకి ఇరువైపులా మొక్కలు నాటారు. ఆ మొక్కలు చెట్లుగా మారి నీడనిస్తూ అందంగా కనిపిస్తున్న తరుణంలో దన్నానపేట గ్రామానికి చెందిన కొంత మంది ఇటీవల సుమారు కిలోమీటరు మేర చెట్లను నరికేశారు. ఏడాకుల చెట్లు ఉండకూడదనే కారణంతో అధికారుల నుంచి ఎటువంటి అనుమతులు తీసుకోకుండానే నరికేశారని స్థానికులు చెబుతున్నారు. అయితే చెట్లు ఏపుగా ఎదగడంతో సొంతానికి ఉపయోగించుకునేందుకే ఈ విధంగా చేశారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇటీవల ఆ రహదారిలో ప్రయాణించిన స్థానిక ఎమ్మెల్యే లోకం నాగమాధవి చెట్లను కొడుతుండడం చూసి అధికారులను ప్రశ్నించారు. స్పందించిన పంచాయతీ సిబ్బంది తమకి సమాచారం ఇవ్వకుండానే చెట్లను తొలగించారని బదులిచ్చారు. కొట్టేసిన చెట్లను భద్రపరచాలని ఆమె సూచించారు. చెట్లను కొడుతున్నట్లు తనకి సమాచారం ఇవ్వలేదని స్థానిక సర్పంచ్ గేదెల రామచిరంజీవి కూడా ఎంపీడీఓ, ఈఓపీఆర్‌డీకి ఫిర్యాదు చేశారు. విషయం కాస్తా ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో చెట్లను పంచాయతీ కార్యాలయంలో భద్రపరచాలని మండల అధికారులకు సూచించారు. దీంతో పది రోజుల కిందట కొట్టేసిన చెట్లను తరలించే ఏర్పాట్లు చేస్తుండగా గ్రామానికి చెందిన టీడీపీ నేతలు, కార్యకర్తలు తరలించకుండా అడ్డుకున్నారు. దీంతో కేవలం ఒక లోడు మాత్రమే పంచాయతీ కార్యాలయానికి చేరుకోగా ఇంకా రోడ్డు పక్కనే చాలా వరకు నరికేసిన చెట్లు పడి ఉన్నాయి. ప్రభుత్వ సొత్తును సొంతానికి వాడుకునేందుకు టీడీపీ నేతలు అడ్డంకులు సృష్టిస్తున్నారని సర్పంచ్ చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఆర్అండ్‌బీ పరిధిలోకి..

రోడ్డు పక్కన ఏడాకుల చెట్లను గ్రామానికి చెందిన కొంత మంది తొలగించినట్లు నా దృష్టికి వచ్చింది. ఆ రహదారి ఆర్అండ్‌బీ పరిధిలోకి వస్తుంది. చెట్లను వేలం వేసేందుకు భద్రపరచాలని ఆర్అండ్‌బీ జేఈ పంచాయతీ కార్యదర్శికి లేఖ రాశారు. తరలించే క్రమంలో గొడవ జరగడంతో చేసేదేమి లేక అక్కడే వదిలేశారు. మరోసారి పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

– రామకృష్ణరాజు, ఎంపీడీఓ, నెల్లిమర్ల

27న ధన్వంతరి హోమం



ధన్వంతరీ హోమం కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఫ్రెండ్స్ గ్రూప్ ప్రతినిధులు

విజయనగరం టౌన్: సర్వరోగాలను హరించే శ్రీ ధన్వంతరి హోమం మొట్టమొదటిసారి విజయనగరంలో ఫ్రెండ్స్ గ్రూప్ ఆధ్వర్యంలో మార్చి 27న నిర్వహించనున్నట్టు ప్రాజెక్ట్ చైర్మన్ బొడ్డు వెంకటేశ్వరప్రసాద్ తెలిపారు. మంగళవారం గ్రూప్ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ లోక కల్యాణార్థం విశ్వశాంతి కోసం హోమం చేపడుతున్నట్టు, శ్రీ ధన్వంతరి హోమంలో పాల్గొనడం వలన సమస్త రోగ నివారణ కలిగి, ప్రజలు ఆరోగ్యంతో జీవిస్తారన్నారు. కొత్తపేట మన్నార్ రాజగోపాలస్వామి ఆలయంలో హోమం నిర్వహిస్తామన్నారు. 60 మంది రుత్వికులు, 162 మంది దంపతుల సమక్షంలో హోమం చేపడతామన్నారు. కార్యక్రమంలో గూడురు సురేష్, రమేష్, గోపాల్, జగదీష్, కొప్పరపు కృష్ణ, రవ్వా వెంకటేశ్వరరావు, నారాయణం లక్ష్మణరావు పాల్గొన్నారు.